క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు



కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న అధికారులు

దత్తిరాజేరు: పెదమానాపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ వరప్రసాద్ శుక్ర వారం తనిఖీలు చేశారు. పౌష్టికాహార స్టాక్, రికార్డులు, మరుగుదొడ్లను పరిశీలించారు. కేంద్రంలో చిన్నారులతో ముచ్చ టించి, వారితో ఏబీసీడీలు చెప్పించారు. బాలింతలు,గర్భిణులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని, కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు. అధికారుల వెంట ఐసీడీఎస్ సూపర్ వైజర్ అపర్ణరాణి ఉన్నారు.

నేడు గోసంరక్షకులకు సన్మానం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రామకృష్ణ, తదితరులు

గంట్యాడ: జిల్లాలో గోసంరక్షణకు కృషి చేస్తున్న వారిని శనివారం సన్మానించనున్నట్లు ఏపీ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామ కృష్ణ తెలిపారు. మండలంలోని చంద్రంపేటలో గోసంరక్షణ సమాఖ్య జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు చోల్ల రాజకుమారి నివాసం వద్ద శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల14న విజయనగరం పట్టణంలోని నల్ల మారమ్మ గుడి వద్ద జంతు ప్రేమికుల ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశామని చెప్పారు. జంతు సంక్షేమానికి కృషి చేస్తున్న వారంతా ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సంబంధింత కరపత్రాలను ఆవిష్కరించారు. గోసంరక్షణ సమాఖ్య ప్రతినిధులు సత్యనారా యణ, రూపవతి, నీలాపు దేవి, విశ్వనాథ్, రవికిరణ్ పాల్గొన్నారు.

ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కండి



వేపాడ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఏటీఎంపీ-1 పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు

వేపాడ: పదోతరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికతో సిద్ధం కావాలని ఎంఈఓ జగదీశ్వరరావు సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన ఎస్ఏటీ ఎంపీ-1 పరీక్షను పరిశీలించారు. విద్యార్థులకు పలుసూచనలు చేశారు. అనంతరం పాఠశాల గ్రంథాలయాన్ని సందర్శించారు. అలాగే ఎంఈఓ-2 బాలభాస్కరరావు చినగుడిపాల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో అపార్ నమోదు, మధ్యాహ్న భోజనపథకం నిర్వహణపై ఆరా తీశారు.

గుండెపోటుతో అధ్యాపకుడు మృతి



డాక్టర్ వలీఖాన్ (ఫైల్)

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మ్యాథ్‌మెటిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ధర్మవరం గ్రామానికి చెందిన షేక్ వలీఖాన్(42) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు,తోటి అధ్యాపకులు తెలిపిన వివరా లు. గురువారం విధుల నిర్వహణ అనంతరం ధర్మవరంలో తన ఇంటికి వెళ్లిన వలీఖాన్ రాత్రి 7.30 గంటల సమయంలో అస్వస్థతకు లోనయ్యారు. కుటుంబీకులు హుటాహుటిన ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే ఆయన గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈయన గతంలో ఉమ్మడి విజయనగరం జిల్లా జీసీటీఏ అధ్యక్షు డిగా పనిచేశారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వలీఖాన్ మృతిపై ప్రభుత్వ కళాశాలల టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఉమా మహేశ్వరరావు, డాక్టర్ జి.ఈరన్న తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

'జియో' రామకృష్ణకు సన్మానం



రామకృష్ణను సన్మానిస్తున్న అధికారులు

శృంగవరపుకోట: పర్యావరణ పరిరక్షణ కోసం రెండు దశాబ్దాలుగా కృషి చేస్తున్న ఎస్.కోటకు చెందిన జియో(గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్) స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాప కుడు బొబ్బిలి రామకృష్ణను 16వ జాతీయ గిరిజన సమ్మేళనంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. విశాఖపట్నంలోని గీతం విశ్వ విద్యాలయంలో నిర్వహించిన జాతీయ గిరిజన సమ్మేళనం ముగింపు సంబరాల్లో జియో, సిమ్ స్వచ్ఛంద సంస్థల ద్వారా గిరిజన గ్రామాల్లో పర్యావరణం, విద్య, వైద్య సేవలు అందించిన రామకృష్ణను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు అన్షుమన్ ప్రసాద్‌దాస్, కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అధికారి దినేష్‌కుమార్‌మీనా, వీరేంద్ర సింగ్, తదితరులు రామకృష్ణను సన్మానించారు.

హడావిడే మిగిలింది..!

- మరమ్మతులకు నోచుకోని గజపతినగరం-మెంటాడ రోడ్డు
- సీఎం చంద్రబాబే మరమ్మతుల పనులు ప్రారంభిస్తారంటూ నెలన్నర క్రితం హంగామా
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో రద్దయిన కార్యక్రమం
- నాటి నుంచి పనుల ఊసే ఎత్తని పాలకులు, అధికారులు



గజపతినగరం-మెంటాడ రోడ్డులో పురిటిపెంట సమీపంలో తేలిన గోతులు



గంగచోళ్ల పెంట వద్ద రాళ్లు తేలిన రోడ్డు

గజపతినగరం: రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లకు మరమ్మతులు చేయిస్తాం... 2025 జనవరి నాటికి పనులను పూర్తి చేయిస్తా మని సీఎం నారా చంద్రబాబునాయుడు ఆర్బాటంగా ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్‌బీ రోడ్ల మరమ్మతులను విజయనగరం జిల్లా నుంచే ప్రారంభించబోతున్నామంటూ నెలన్నర క్రితం హడావిడి చేశారు. గజపతినగరం నియోజకవర్గంలో నవంబర్ 2న గజపతినగరం -మెంటాడ రోడ్డు మరమ్మతుల పనులను సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని, సుమారు పది కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ.38 లక్షలు మంజూరయ్యా యని అధికారులు అప్పటిలో ప్రకటించారు. సీఎం పర్యటన కోసం పురిటిపెంటలో హెలీప్యాడ్ నిర్మించడంతో పాటు గంగచోళ్లపెంటలో ప్రెస్‌మీట్ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.సాక్షాత్తు ముఖ్యమంత్రే వచ్చి మరమ్మతు పనులు ప్రారంభిస్తారని చెప్పడంతో ఇంకేముంది తమ ఇబ్బందులు తీరబోతున్నాయని గజపతినగరం, మెంటాడ మండలాల ప్రజలు భావించారు.కానీ నవంబర్ 2న సీఎం చంద్రబాబు రోడ్డు మరమ్మతులు ప్రారంభించాల్సి ఉండగా నవంబర్ 1వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో సీఎం పర్యటన రద్దు అయ్యింది. దీంతో రోడ్డు మరమ్మతులు ప్రారంభం కాలేదు. రోడ్డు అధ్వానంగా తయారు కావడంతో గజపతినగరం నుంచి మెంటాడ జంక్షన్ మీదుగా పురిటిపెంట,గంగచోళ్ల పెంట, కొత్తబగ్గాం తదితర గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు.సీఎం పర్యటన రద్దయితే రోడ్డు మరమ్మతులు చేయకూడదా, ఆయన వస్తేనే పనులు ప్రారంభిస్తారా అని ఆ మార్గంలో ప్రయాణించే వారు ప్రశ్నిస్తున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులతో శిథిలమైన రోడ్డు

గజపతినగరం- మెంటాడ మండల కేంద్రాల మధ్య 2018వ సంవత్సరంలో పది కిలోమీటర్ల మేర కొత్తగా బీటీ రోడ్డు వేశారు. అది కొన్నాళ్లకే పాడైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత విశాఖ-రాయ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆ హైవే నిర్మాణానికి అవసరమైన సామగ్రి అంతా భారీ వాహనాల్లో గజపతినగరం- మెంటాడ రోడ్డుపైనే సాగింది.దీంతో రోడ్డు పూర్తిగా శిథిలమైంది. దాన్ని బాగుచేయించాలని నాటి గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ప్రయత్నించారు. రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదన లు సిద్ధం చేయించారు. అయితే గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ సంస్థ అధికారులు మాత్రం ఆ రోడ్డు మరమ్మతు బాధ్యతలు తామే తీసుకుంటామని, గ్రీన్ ఫీల్డ్ రోడ్డు పనులు పూర్తయిన వెంటనే పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం దాదాపు పూర్తయ్యింది కానీ రోడ్డు మరమ్మతుల విషయాన్ని హైవే అధికారులు కూడా మరచి పోయారని స్థానికులు అంటున్నారు.

ఎదురు చూస్తున్నాం..



రోడ్డు మరమ్మతులు ఎప్పుడు చేపడతారా అని ఎదురు చూస్తున్నాం. సీఎం చంద్రబాబు వస్తారు, రోడ్డు మరమ్మతులు ప్రారంభిస్తారంటూ నెలన్నర క్రితం హంగామా చేశారు. పనులు జరిగిపోతాయని అంతా సంబరపడ్డాం. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల పనులు వాయిదా పడ్డాయన్నారు. మళ్లీ పనులు చేస్తారనుకున్నాం. కానీ ఆ పరిస్థితి కనిపించడం లేదు.

– పిన్నింటి బంగారు నాయుడు, పురిటిపెంట, గజపతినగరం మండలం

రోడ్డు ప్రమాదకరంగా ఉంది



గజపతినగరం-మెంటాడ రోడ్డులో ఎక్కడికక్కడ గోతులు తేలాయి. పురిటిపెంట బంగారమ్మ తల్లి గుడి సమీపంలో గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. ద్విచక్ర వాహనచోదకులు అదుపుతప్పి పడిపోతున్నారు. ఈరోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి త్వరగా రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

– దాసరి అప్పలనాయుడు, పురిటిపెంట, గజపతినగరం మండలం

సంఘాలను బలోపేతం చేసుకోవాలి



మాట్లాడుతున్న గుర్ల ఏపీఎం మహేష్

చీపురుపల్లి: స్వయం సహాయక, గ్రామైక్య సంఘాలను బలోపేతం చేసుకోవడంతో పాటు గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దు కోవాలని గుర్ల ఏపీఎం కెల్ల మహేష్ సూచించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మూడు రోజులుగా మహిళా సంఘాల సభ్యులకు విజన్ బిల్డింగ్‌పై ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని, సంఘాలతో పాటు గ్రామాలు, మండలాలు కూడా ఆదర్శవంతంగా తయారయ్యేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఇక్కడకు శిక్షణకు వచ్చిన వారు గ్రామాల్లో మిగిలిన సంఘాలు, సభ్యులకు ప్రణాళికలు వివరించాలన్నారు. సమష్టి కృషితోనే లక్ష్యాలు చేరుకోగలమన్నారు. నెలిమర్ల, చీపురుపల్లి ఏపీఎంలు ఎల్.పద్మ, ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిఅస్త్రంతో కత్తెర పురుగుకు చెక్

మెరకముడిదాం: మొక్కజొన్న పంటను ఆశించే కత్తెర పురుగును అగ్నిఅస్త్రంతో నివారించవచ్చని సేంద్రియ ఎరువుల మాస్టర్ ట్రైనీ సూర్యకుమారి అన్నా రు. అగ్నిఅస్త్రం తయారీపై మండలంలోని సాతాంవలస గ్రామంలో రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్నిఅస్త్రం తయారీకి 20 లీటర్ల దేశీయ ఆవుల మూత్రం, కిలో పచ్చిమిర్చి, కిలో పొగాకు, 5 కిలోల వేపాకులు అవసర మ న్నారు. పచ్చిమిర్చి, పొగాకు, వేపాకులను ముద్దగా చేసి మరుగుతున్న గోమూత్రంలో వేసి అయిదు పొంగులు వచ్చేవరకు ఉంచాలన్నారు. 48 గంటల తర్వాత ఈ ద్రావణాన్ని వడకట్టి 15 లీటర్లను 100 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేసుకోవాలని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాములమ్మ, ఈశ్వరరావు, కల్యాణి, రమాదేవి, పైడినాయుడు, రామారావు పాల్గొన్నారు.



అగ్ని అస్త్రం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతివ్యవసాయ సిబ్బంది

జీవనోపాధి మెరుగుపరుచుకోవాలి



మాట్లాడుతున్న వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ బంగారమ్మ

చీపురుపల్లిరూరల్(గరివిడి): స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజ్, స్త్రీనిధి రుణాలను సద్వినియోగించుకుని జీవనోపాధులను మెరుగుపరుచుకోవాలని వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ బి.బంగారమ్మ అన్నారు.గరివిడి సమాఖ్య కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 36 గ్రామై క్య సంఘాలు,1,686 స్వయం సహాయక సంఘా ల్లోని సభ్యులు ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించుకుని, సంఘాల ఆర్థికాభివృద్ధి, బలోపేతానికి ప్రణాళికలు తయారు చేసుకోవాలని, సమష్టిగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. రైతు ఉత్పత్తి సంఘాల్లో ఉన్న మహిళలకు డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింకర్ల పరికరాలను 90 శాతం రాయితీపై ఇరిగేషన్‌శాఖ అందిస్తుందని చెప్పారు. పరికరాలు కావాల్సిన రైతులు సంబంధిత సచివాలయాల్లో ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. ఏపీఎంలు పి.నారాయణ రావు, ఎస్.విజయలక్ష్మి, ఏ.పద్మావతి, స్త్రీనిధి మేనేజర్ ఎర్రినాయుడు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, మండల సమాఖ్య అధ్యక్షులు వెంకటలక్ష్మి, మండల సమాఖ్య ఓబీ, ఈసీలు పాల్గొన్నారు.

ఆరోగ్యం, అభివృద్ధే లక్ష్యం



గజపతినగరం: మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు సుబ్బారావు



దత్తిరాజేరు: మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు నాగరాజు

దత్తిరాజేరు: గ్రామాల సమగ్రాభివృద్ధి, ప్రజారోగ్యం, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సర్పంచ్‌లు, పంచాయతీల అధికారులు పనిచేయాలని సుస్థిర గ్రామాభివృద్ధి లక్ష్యాల శిక్షణ రాష్ట్ర పరిశీలకులు కె.నాగరాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు సుస్థిర గ్రామాభివృద్ధి లక్ష్యాలపై శుక్రవారం నిర్వహించిన శిక్షణను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సర్పంచ్‌ల కృషితోనే అన్ని రంగాల్లో గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరుచుకోవాలని, తరచూ పారిశుద్ధ్య పనులు చేయించాలని, మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఈఓపీఆర్డీ వాణిశ్రీ పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

గజపతినగరం: సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు అంతా సమన్వయంతో పని చేసినప్పుడే గ్రామాల్లో సమస్యలు పరిష్కారమవుతాయని, అభివృద్ధి సాధ్యమని సుస్థిర గ్రామాభివృద్ధి లక్ష్యాల శిక్షణ రాష్ట్ర పరిశీలకులు సుబ్బారావు అన్నారు. స్థానిక పాతమండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సుస్థిర గ్రామాభివృద్ధి లక్ష్యాలపై శుక్రవారం నిర్వహించిన శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో జలజీవన మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా రక్షిత తాగునీరు అందేలా చూడాలని, మౌలిక సదుపాయాల పై దృష్టి సారించాలని ఆయన సూచించారు.ఎంపీడీఓ బి.కల్యాణి, సీహెచ్ఓ లక్ష్మి, ఏపీఎం ఎల్.సత్యనారాయణ, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించేందుకే సదస్సులు



మందిరవలసలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు



దత్తిరాజేరు: పెదమానాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, జెడ్పీటీసీ రాజేశ్వరి



వేపాడ: చినగుడిపాలలో అధికారులకు అర్జీలు అందజేస్తున్న రైతులు



బొండపల్లి: కనిమెరకలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొండపల్లి: భూసమస్యలను గ్రామాల్లోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు తెలిపారు. కనిమెరక గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూసమస్యలపై అర్జీలు అందజేస్తే నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.మండల ప్రత్యేక అధికారి సాలమ్న్ రాజు, సర్పంచ్ సిరిపురం ఆది నారాయణ, ఆర్ఐ హరికృష్ణ పాల్గొన్నారు.

సద్వినియోగించుకోండి

వేపాడ: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగించుకోవాలని తహసీల్దార్ రాములమ్మ సూచించారు. మండలంలోని చినగుడిపాలలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వ హించారు. భూసమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సర్పంచ్ రామునా యుడు, ఆర్ఐ రామలక్ష్మి, గ్రామపెద్దలు, పాల్గొన్నారు.

అర్జీలను బుట్టదాఖలు చేయవద్దు

దత్తిరాజేరు: భూసమస్యలపై రెవెన్యూ సదస్సులలో రైతులు అందజేస్తున్న అర్జీలను బుట్టదాఖలు చేయకుండా వాటిని పరిశీలించి సకాలంలో సమస్యలు పరిష్క రించాలని జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి అధికారులకు సూచించారు. పెదమానాపురంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ వరప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వ హించి, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. అంతకు ముందు అధికారులు, నాయకులు గ్రామంలో ర్యాలీ చేశారు. మండల ప్రత్యేక అధికారి శాంతకుమారి, సర్వేయర్ సుబ్బారావు, రిజిస్ట్రేషన్ శాఖ సీనియర్ అసిస్టెంట్ మౌనిక, వీఆర్ఓలు కార్తీక్, బలరాం పాల్గొన్నారు.

వెంటనే పరిష్కరించండి

చీపురుపల్లిరూరల్(గరివిడి): భూసమస్యలపై రెవెన్యూ సదస్సులలో రైతులు అందిస్తున్న అర్జీలను పరిశీలించి వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అధికారులను ఆదేశించారు. గరివిడి మండలంలోని మందిరవలస గ్రామంలో తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన అతిథిగా హాజరయ్యారు. పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులు ఏమైనా ఉంటే సరిచేసుకోవాలని రైతులకు ఎమ్మెల్యే సూచించారు.

పునరావాసం కల్పించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గాంధీనగర్ గ్రామస్తులు

లక్కవరపుకోట: రాయపూర్-విశాఖపట్నం గ్రీన్‌ఫీల్డ్ హైవే(ఎన్‌హెచ్-130, సీడీ) నిర్మాణంలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న తమకు పునరావాసం కల్పించాలని కొత్త వలస మండలంలోని ఉత్తరాపల్లి శివారు గ్రామం గాంధీనగర్ వాసులు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కోరారు. ఇళ్లు కోల్పోతున్న 20 కుటుంబాల వారు ఎమ్మె ల్యేను ఎల్.కోటలోని తన నివాసంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 40 ఏళ్లుగా ప్రభుత్వం వారు ఇచ్చిన ఇళ్లలో నివాసం ఉంటున్నామని, రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్నామని చెప్పారు. నిరుపేదలమైన తమకు పునరావాసం కల్పించాలని కోరారు. సీపీఎం నాయకులు గాడి అప్పారావు, తరిణి వెంకటరమణ పాల్గొన్నారు.

గద్దర్ అవార్డు గ్రహీతలకు అభినందనలు



వేపాడ: గద్దర్ అవార్డు అందుకుంటున్న గొండయ్య



గజపతినగరం: అవార్డు అందుకుంటున్న న్యాయవాది సూర్యనారాయణ

వేపాడ/గజపతినగరం: వేపాడ మండలంలోని వావిలపాడు గ్రామానికి చెందిన కళాకారుడు తొత్తడి గొండయ్య,బహుజన కళామండలి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, న్యాయవాది అయిన గజపతినగరానికి చెందిన గెద్దాడ సూర్యనారాయణను గద్దర్ జాతీయ అవార్డులు వరించాయి. మమత స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో గురువారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో గద్దర్ కుమార్తె, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల గద్దర్ చేతుల మీదుగా వారు అవార్డులు అందుకున్నారు. ఆయా మండలాల కళాకారులు, గ్రామస్తులు వారికి శుక్రవారం అభినందనలు తెలిపారు.

సీతారామపురంలో వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి సుష్మ

గజపతినగరం: మండలంలోని సీతారామపురం గ్రామసచివాలయంలో శుక్రవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బందితో కలిసి మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ 47మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరానికి రాలేకపోయిన గ్రామంలోని వృద్ధులు, గర్భిణుల ఇళ్లకు వెళ్లి వైద్య తనిఖీలు చేశారు.

● అన్నదాతకు మద్దతుగా...

రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం విజయనగరంలో శుక్రవారం నిర్వహించిన 'అన్నదాతకు అండగా పోరుబాట' కార్యక్రమానికి చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రేణులు, రైతులు భారీగా తరలివెళ్లారు. దగాపడిన రైతన్నకు మద్దతుగా కలెక్టరేట్ వద్ద నిరసన గళం వినిపించారు.

– చీపురుపల్లి/మెరకముడిదాం/ గంట్యాడ



చీపురుపల్లి: పోరుబాటకు తరలి వెళుతున్నమండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



మెరకముడిదాం: ధర్నాకు బయలుదేరిన మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



గంట్యాడ: కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న గంట్యాడ మండల వైఎస్సార్ సీపీ నాయకులు